## ఐవోసీ చీఫ్‌గా క్రిస్టీ

**తొలి మహిళా అధ్యక్షురాలిగా రికార్డు**



కోస్టా నవారీనో(గ్రీస్): అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) కొత్త శకం ఆరంభం కాబోతున్నది. జింబాబ్వేకు చెందిన రెండు సార్లు ఒలింపిక్స్ స్వర్ణ విజేత క్రిస్టీ కోవెంట్రీ ఐవోసీ నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైంది. గురువారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో క్రిస్టీ విజయానికి అవసరమైన 49 ఓట్లు దక్కించుకుని విజేతగా నిలిచింది. దీంతో 131 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కల్గిన ఐవోసీలో తొలి మహిళా అధ్యక్షురాలిగా క్రిస్టీ కోవెంట్రీ అరుదైన ఘనత సొంతం చేసుకుంది. మొత్తం 97 మంది ఐవోసీ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, జువాన్ అంటానియో సమరంచ్‌కు 28 ఓట్లు, సెబాస్టియన్ కో 8 ఓట్లతో రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. 12 ఏండ్ల పాటు ఐవోసీ బాస్‌గా వ్యవహరించిన థామస్ బాచ్ స్థానంలో క్రిస్టీ కోవెంట్రీ బాధ్యతలు స్వీకరించనుంది. లాస్‌ఎంజిల్(2028) ఒలింపిక్స్ నిర్వహణతో పాటు 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం భారత్, మిడిల్‌ఈస్ట్ పోటీపడుతున్న నేపథ్యంలో క్రిస్టీ కీలక సవాళ్లు ఎదుర్కొనే అవకాశముంది.

## రాజస్థాన్ సారథిగా పరాగ్

ఢిల్లీ: ఐపీఎల్ కొత్త సీజన్‌లో ఆరంభ మ్యాచ్‌లను రాజస్థాన్ రాయల్స్ తమ రెగ్యులర్ కెప్టెన్ సంజూ శాంసన్ నేతృత్వంలో కాకుండా యువ ఆల్‌రౌండర్ రియాన్ పరాగ్ కెప్టెన్సీలో ఆడనుంది. తొలి మూడు మ్యాచ్‌లకు పరాగ్ సారథిగా వ్యవహరిస్తాడని గురువారం రాజస్థాన్ మేనేజ్‌మెంట్ ఓ ప్రకటనలో తెలిపింది. సంజూ జట్టుతో ఉన్నా ప్యూర్ బ్యాటర్‌గానే కొనసాగుతాడు.

## ఖేలో ఇండియా పారా గేమ్స్ షురూ

న్యూఢిల్లీ: ఖేలో ఇండియా పారా గేమ్స్‌కు గురువారం తెరలేచింది. ఎనిమిది రోజుల పాటు జరిగే పారాగేమ్స్‌ను కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుక్ మాండవీయా అధికారికంగా ప్రారంభించారు. మొత్తం 1300 మంది పారా అథ్లెట్లు ఆరు క్రీడా విభాగాల్లో పోటీపడుతారని ఆయన పేర్కొన్నారు.

## చాహల్, ధనశ్రీకి విడాకులు మంజూరు



ముంబై: టీమ్‌ఇండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్.. ధనశ్రీ వర్మ విడాకులు తీసుకున్నారు. 2020లో వీరి వివాహం జరగగా 2022 నుంచే ఈ ఇద్దరూ విడివిడిగా ఉంటున్నారు. గత నెల 5న పరస్పర అంగీకారంతో విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్న చాహల్-ధనశ్రీకి ముంబైలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టు గురువారం విడాకులు మంజూరు చేసింది. విచారణ నిమిత్తం ఈ ఇద్దరూ మధ్యాహ్నం బాంద్రా న్యాయస్థానానికి హాజరవగా వీరికి కోర్టు విడాకులు ఇచ్చిందని చాహల్ తరపు న్యాయవాది నితిన్ గుప్తా వెల్లడించారు. భరణం కింద చాహల్.. ధనశ్రీకి రూ. 4.75 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించగా అందులో ఇప్పటికే రూ. 2.37 కోట్లు చెల్లించినట్టు సమాచారం.

## చాంపియన్స్‌కు 58 కోట్ల రివార్డు



ముంబై: ఇటీవలే దుబాయ్ వేదికగా ముగిసిన చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచిన రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. 12 ఏండ్ల విరామం తర్వాత చాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన టీమ్‌ఇండియాకు రూ.58 కోట్ల క్యాష్ ప్రైజ్ ప్రకటించింది. ఇది ఐసీసీ ప్రైజ్‌మనీ (రూ. 19.50 కోట్లు) కంటే మూడు రెట్లు అధికం కావడం విశేషం. బీసీసీఐ ప్రకటించిన నగదు బహుమానంలో జట్టు సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 3 కోట్లు అందనుంది. హెడ్ కోచ్ గౌతం గంభీర్‌కూ ఆటగాళ్లతో సమానంగా రూ. 3 కోట్లు దక్కనుంది. అతడి కోచింగ్ బృందం (రియాన్ డస్కటె, అభిషేక్ నాయర్, సితాన్షు కొటక్, మోర్నీ మోర్కెల్, దిలీప్)తో పాటు ఇతర సహాయక సిబ్బందికి తలా రూ. 50 లక్షలు అందనున్నాయి. జట్టుతో ప్రయాణించిన బీసీసీఐ ప్రతినిధులకు తలా రూ. 25 లక్షలు దక్కుతాయి.

# ఆరుపై గురి

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం








శనివారం నుంచి ప్రారంభం కాబోయే ఐపీఎల్‌లో ఇది 18వ సీజన్. గడిచిన 17 సీజన్లలో తాము ఆడిన 15 సీజన్ల (2016, 2017లో రెండేండ్లు నిషేధం)లో ఐదు ట్రోఫీలు గెలవడం ఒకెత్తు అయితే ఈ టోర్నీలో ఏకంగా పదిసార్లు ఫైనల్ ఆడిన జట్టు ఏదైనా ఉందా? అంటే అది చెన్నై సూపర్ కింగ్స్ మాత్రమే. 2010, 2011, 2018, 2021, 2023లో టైటిళ్లు సాధించిన సీఎస్‌కే.. 2008, 2012, 2013, 2015, 2019లో రన్నరప్‌గా నిలిచింది. ఆడిన 15 సీజన్లలో 2020, 2022, 2024లో మినహాయిస్తే ఆ జట్టు ప్లేఆఫ్స్‌కు వెళ్లకుండా సీజన్‌ను ముగించలేదంటే ఆ జట్టు ఎంత నిలకడగా ఆడుతుందో అర్థం చేసుకోవచ్చు. భారత జట్టుకు మూడు ఐసీసీ ట్రోఫీలు అందించిన దిగ్గజ సారథి మహేంద్రసింగ్ ధోనీ సారథ్యంలో టోర్నీలోనే అత్యంత విజయవంతమైన జట్టుగా రికార్డులకెక్కిన చెన్నై.. గత సీజన్‌లో కొత్త సారథి రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో విఫలమైంది. నిరుటి సీజన్‌లో విఫలమైనప్పటికీ 2025లో మాత్రం సత్తా చాటి ఆరో టైటిల్‌ను దక్కించుకోవాలని సీఎస్‌కే పట్టుదలతో ఉంది.

### అన్ని విభాగాల్లో పటిష్టం

ఈ సీజన్‌లో మరే జట్టుకూ లేని పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ మాత్రమే గాక ఉన్నవారిలో అధికంగా ఆల్‌రౌండర్లు ఉండటం చెన్నై సొంతం. రచిన్ రవీంద్ర, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, డెవాన్ కాన్వేకు రాహుల్ త్రిపాఠి జతకలవడం ఆ జట్టు బ్యాటింగ్ బలాన్ని మరింత పెంచింది. మిడిలార్డర్‌లో సిక్సర్ల వీరుడు శివమ్ దూబే, పేస్ ఆల్‌రౌండర్ సామ్ కరన్‌తో పాటు ఫినిషర్లుగా ధోనీ, జడ్డూ ఉండనే ఉన్నారు. దీపక్ హుడా, విజయ్ శంకర్ వంటి నాణ్యమైన ఆల్‌రౌండర్లతో చెన్నై బెంచ్ బలంగా ఉంది. చాలాకాలం తర్వాత అశ్విన్ కూడా సీఎస్‌కేతో చేరడంతో ఆ జట్టు బలం మరింత పెరిగింది. బంతి గింగిరాలు తిరిగే చిదంబరం స్టేడియంలో అశ్విన్‌ను ఎదుర్కోవడం ప్రత్యర్థులకు శక్తికి మించిన పనే. అశ్విన్‌కు అండగా 20 ఏండ్ల అఫ్గాన్ స్పిన్నర్ నూర్ అహ్మద్ మిడిల్ ఓవర్లలో చెన్నైకి కీలకం కానున్నాడు. జెమీ ఓవర్టన్, ఖలీల్ అహ్మద్, మతీశ పతిరాన, ముకేశ్ చౌదరి వంటి పేసర్లతో చెన్నై పేస్ విభాగం సైతం సమతుల్యంగానే ఉంది.

### ధోనీ.. ముగిస్తాడా?

2020లో అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన తర్వాత ఐపీఎల్ మాత్రమే ఆడుతున్న ధోనీ.. గత మూడు సీజన్లుగా వస్తున్న ఊహాగానాలకు చెక్ పెడుతూ చెన్నైలో కొనసాగుతున్నాడు. సారథ్య పగ్గాలు రుతురాజ్‌కు అప్పజెప్పినా ఇప్పటికీ అతడు అనధికారిక సారథే. గాయాలు, ఫిట్‌నెస్ ఇతరత్రా కారణాల రీత్యా ధోనీ ఈ సీజన్‌తో ముగిస్తాడని మళ్లీ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరి ధోనీ మనసులో ఏముందో?

ఐపీఎల్ ఆరంభ సీజన్ నుంచి ఈ లీగ్‌లో ఉండి నిలకడగా ఆడుతున్న మరో దిగ్గజ జట్టు ముంబై ఇండియన్స్. చెన్నై మాదిరిగానే ఐదు టైటిల్స్ సొంతం చేసుకున్న ముంబైది ఈ టోర్నీలో ఘనచరిత్రే. తొలి రెండు సీజన్లలో లీగ్ దశకే పరిమితమైన ఆ జట్టు 2010లో రన్నరప్‌గా నిలిచింది. రోహిత్ శర్మ రాకతో 2013లో టైటిల్ వేటను ప్రారంభించింది. 2015, 2017, 2019, 2020లో చాంపియన్‌గా నిలిచింది. కానీ ఆ తర్వాత ముంబై గాడి తప్పింది. గత సీజన్‌లో అట్టడుగు స్థానంలో నిలిచిన ముంబై.. ఈ సీజన్‌లో మాత్రం పుంజుకుని మళ్లీ చాంపియన్‌గా నిలవాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది.

### ఆ సమస్య తీరింది!

2024 సీజన్‌కు ముందు ముంబై.. రోహిత్‌ను కాదని హార్దిక్ పాండ్యాను సారథిగా నియమించడం వివాదాలకు కేంద్ర బిందువైంది. హార్దిక్‌కు యాజమాన్యం మద్దతు ఉన్నా వాంఖడేతో పాటు ముంబై ఎక్కడ మ్యాచ్‌లు ఆడినా అతడికి ఛీత్కారాలే ఎదురయ్యాయి. అదీగాక హార్దిక్, రోహిత్ మధ్య విబేధాలు ఉన్నాయని, డ్రెస్సింగ్ రూమ్ రెండుగా చీలిపోయిందని వార్తలు రావడం ఆ జట్టు ప్రదర్శనను బాగా దెబ్బతీసింది. కానీ ఈ ఏడాది కాలంలో చాలా మార్పులు జరిగాయి. రోహిత్ సారథ్యంలో గతేడాది టీ20 ప్రపంచకప్, ఈ ఏడాది చాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన జట్టులో హార్దిక్ ముఖ్య భూమిక పోషించడంతో ముంబై అభిమానులు 'పాత పగలు' అన్నీ మరిచిపోయి హార్దిక్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

### సమిష్టిగా సత్తా చాటితే..

బ్యాటింగ్‌లో ముంబైకి సమస్యలు లేకపోయినప్పటికీ బుమ్రా తప్ప సిసలైన పేసర్ లేకపోవడం ఆ జట్టును గతంలో ఇబ్బందులకు గురిచేసింది. కానీ ఈసారి వేలంలో ముంబై.. బౌల్ట్, చాహర్‌ను తిరిగి దక్కించుకుంది. వీరికి బుమ్రా కూడా జతకలిస్తే ఇంకేమైనా ఉందా? అయితే బుమ్రా ముంబైతో ఎప్పుడు కలుస్తాడు? ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడనే దానిపై స్పష్టత లేకపోవడం ఆ జట్టుకు అతిపెద్ద ఆందోళన. బ్యాటింగ్ పరంగా ముంబై దుర్భేధ్యంగా ఉంది. ఆరంభంలోనే బౌలర్ల లయను దెబ్బతీసే రోహిత్ కు అండగా ఓపెనర్‌గా రికెల్టన్ బరిలోకి దిగే అవకాశముంది. టాపార్డర్‌లో సూర్యభాయ్ కాస్త ఆందోళనకరంగానే ఉన్నా ఒక్క సూపర్ ఇన్నింగ్స్‌తో అతడు మళ్లీ మెరుపులు మెరిపించగలడు. తిలక్ వర్మ నిలకడ, ఫినిషర్‌గా హార్దిక్ మెరుపులు ముంబైకి కీలకం. గాయాలు, ఫిట్‌నెస్ సమస్యల నుంచి తప్పించుకుంటే ముంబై మరోసారి టైటిల్ నెగ్గడం పెద్ద కష్టమేమీ కాదు.

## ఉమ్మిపై నిషేధం ఎత్తివేత

**ఐపీఎల్-18నుంచి అమలు చేయనున్న బీసీసీఐ**

**సారథులకూ శుభవార్త • కెప్టెన్ల సమావేశంలో కీలక నిర్ణయాలు**



ముంబై: బ్యాటర్లు ఆధిపత్యం చెలాయించే ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)లో 18వ సీజన్‌కు ముందు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బౌలర్లకు శుభవార్త చెప్పింది. బంతికి లాలాజలం (ఉమ్మి) రాయడంపై ఉన్న నిషేధాన్ని ఎత్తేసింది. శనివారం నుంచి మొదలుకాబోయే ఐపీఎల్-18వ సీజన్ నుంచి ఈ నిబంధన అమలులోకి రానుంది. ముంబైలో జరిగిన కెప్టెన్ల సమావేశంలో బోర్డు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. బోర్డు ప్రతిపాదనకు మెజారిటీ సారథులు అంగీకారం తెలిపారు. బంతిని రివర్స్ స్వింగ్ చేసే క్రమంలో బౌలర్లు బంతికి ఉమ్మి రాయడం గతంలో కొనసాగింది. కానీ కరోనా వైరస్ విజృంభణ కారణంగా ఐసీసీ దీనిపై నిషేధాన్ని విధించింది. 2022లో ఆ నిర్ణయాన్ని శాశ్వతం చేసింది. అయితే దీనికి వ్యతిరేకంగా ఇటీవల కాలంలో ప్రస్తుతం ఆడుతున్న బౌలర్లతో పాటు మాజీలు సైతం గళమెత్తారు. చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా భారత పేసర్ మహ్మద్ షమీ ఈ అంశాన్ని ప్రస్తావించగా.. దక్షిణాఫ్రికా మాజీ పేసర్ ఫిలాండర్, కివీస్ దిగ్గజం టిమ్ సౌథీ కూడా అతడికి మద్దతు ప్రకటించారు. కాగా ఐసీసీ దీనిపై ఏ విధమైన ప్రకటన చేయకపోయినప్పటికీ ఉమ్మిపై నిషేధాన్ని ఎత్తేసిన తొలి మేజర్ క్రికెట్ బోర్డుగా బీసీసీఐ నిలిచింది. బీసీసీఐ నిర్ణయంతో ఐసీసీ కూడా త్వరలోనే దీనిపై పునరాలోచించే అవకాశం లేకపోలేదు.

### రెండో ఇన్నింగ్స్‌లో బంతి మార్పు

సలైవాపై నిషేధంతో పాటు మరిన్ని కీలక ప్రతిపాదనలకు బీసీసీఐ పచ్చజెండా ఊపింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో బంతిని మార్చుకునేందుకు సారథులకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం రాత్రి పూట జరిగే మ్యాచ్‌లలో సెకండ్ ఇన్నింగ్స్ 11వ ఓవర్ తర్వాత బంతిని మార్చుకునేందుకు సారథికి అవకాశముంటుంది. అయితే పాత బంతి ఏ స్థితిలో ఉందో అలాంటి బంతినే తీసుకునేందుకు ఫీల్డింగ్ టీమ్ కెప్టెన్.. అంపైర్‌ను అడిగే హక్కును కల్పించారు. రాత్రి మ్యాచ్‌లకు మంచు ప్రభావం ఎక్కువగా ఉండే నేపథ్యంలో బంతిపై బౌలర్లకు పట్టు చిక్కేందుకు గాను ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడనుంది. అయితే బంతిని మార్చే విషయంలో అంపైర్ తన విచక్షణతో తుది నిర్ణయం తీసుకుంటాడని బోర్డు తెలిపింది.

### సారథులకు ఉపశమనం

స్లో ఓవర్ రేట్ కారణంగా సారథులపై నిషేధం విధించే విధానానికి బీసీసీఐ స్వస్తి పలికింది. స్లో ఓవర్ రేట్‌కు డీమెరిట్ పాయింట్లు, జరిమానా అధికంగా విధించనుండగా మరీ తీవ్రమైన పరిస్థితుల్లో మాత్రమే ఒక మ్యాచ్ నిషేధాన్ని అమలు చేయనున్నారు.



## 24 నుంచి టీడీసీఏ వన్డే టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం(టీడీసీఏ), అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ(ఏవైసీఏ) అండర్-17 వన్డే క్రికెట్ టోర్నీ ఈనెల 24 నుంచి మొదలుకానుంది. ఏవైసీఏ జట్టుతో టీడీసీఏ రూరల్ వారియర్స్, రూరల్ రైజర్స్, రూరల్ పాంథర్స్ జట్లు రౌండ్ రాబిన్ పద్ధతిలో పోటీపడుతాయి.ఈ టోర్నీకి సంబంధించిన ట్రోఫీలు, జెర్సీలను డీజీపీ జితేందర్ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, అరుణ్, రామిరెడ్డి, పాల్గొన్నారు. మరోవైపు హర్యానాలో జరిగిన 73వ ఆలిండియా పోలీస్ వాలీబాల్ క్లస్టర్ పోటీల్లో తెలంగాణకు చెందిన పోలీసు క్రీడాకారులు మొత్తం 11 కాంస్య పతకాలను గెలుచుకున్నారు.



పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

## 'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి టెన్త్ ఎగ్జామ్స్
- హాజరుకానున్న 5.09 లక్షల మంది స్టూడెంట్స్
- రాష్ట్ర వ్యాప్తంగా 2,650 పరీక్ష కేంద్రాలు
- గంట ముందే చేరుకోవాలి

| పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు.. | |
|---|---|
| బాలురు | 2,58,895 |
| బాలికలు | 2,50,508 |
| మొత్తం | 5,09,403 |

హైదరాబాద్, మార్చి 20(నమస్తే తెలంగాణ) : పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న పరీక్షలు ఏప్రిల్ 4 వరకు జరుగనున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. మొత్తం 11,547 పాఠశాలల నుంచి 5.09 లక్షల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2,650 సెంటర్లు ఏర్పాటుచేశారు. 25 మంది విద్యార్థులకు ఒకరి చొప్పున 28,100 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా విద్యార్థులను పరీక్షలకు అనుమతిస్తారు. గంటముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు, గోడగడియారాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. నీటి సౌకర్యం కల్పించారు. విద్యార్థులకు సందేహాలుంటే 040-232 30942 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## పది విద్యార్థుల వీడ్కోలుకు హాజరై..

- అస్వస్థతతో ప్రైవేటు ఉపాధ్యాయుడు మృతి
- పెద్దపల్లి జిల్లా లో విషాదం



సత్యం(ఫైల్)

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 20 : పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు ఇచ్చేందుకు వచ్చి ఫొటోలు దిగుతున్న ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు అంతలోనే అస్వస్థతకు గురై మృతిచెందిన ఘటన గురువారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో విషాదం నింపింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని అడ్డగుంటపల్లిలో గల శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బలసాని సత్యం(46) పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలకు హాజరయ్యారు. వారికి ఆల్‌ది బెస్ట్ చెపుతూ ఫొటోలు దిగుతుండగా అంతలోనే అస్వస్థతకు గురికావడంతో తోటి ఉపాధ్యాయులు గోదావరిఖని ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. రాంనగర్‌కు చెందిన సత్యం పాతికేళ్లుగా ఉపాధ్యాయుడిగా సేవలు అందిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

## ముగిసిన ఇంటర్ పరీక్షలు

- ఏప్రిల్ మూడోవారంలో వెలువడనున్న ఫలితాలు

హైదరాబాద్, మార్చి 20, (నమస్తే తెలంగాణ): మార్చి 5 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు జరిగిన కెమిస్ట్రీ-2, కామర్స్-2 పరీక్షలకు 4,44,697 మంది విద్యార్థులకు 4,31,964 మంది (97.13%) హాజరయ్యారు. ఏప్రిల్ మూడోవారంలో ఫలితాలు వెల్లడిస్తామని ఇంటర్ బోర్డు అధికారులు పేర్కొన్నారు.

# 25 రోజుల్లో 25 టీఎంసీలు!

**నాగార్జునసాగర్ నుంచి ఏపీకి నీటి తరలింపు**

- కుడికాల్వ నుంచి నిత్యం 8 వేల క్యూసెక్కులు
- అడ్డుకోని కేఆర్ఎంబీ.. పట్టింపేలేని రాష్ట్ర సర్కార్
- తెలంగాణకు పొంచి ఉన్న సాగు, తాగునీటి గండం



హైదరాబాద్, మార్చి20 (నమస్తే తెలంగాణ): పట్టించుకోని కేఆర్ఎంబీ, పట్టింపేలేని తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ వైఖరితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జలాలను అడ్డూఅదుపు లేకుండా తరలించుకుపోతున్నది. సాగర్ కుడి కాలువ ద్వారా రోజుకు 8 వేల క్యూసెక్కుల చొప్పున కోటాకు మించి 52 టీఎంసీల నీటిని అదనంగా కొల్లగొట్టింది. నికర జలాల నిర్ధారణ కోసం కేఆర్ఎంబీ బోర్డు అత్యవసర సమావేశం నిర్వహించి నాటి నుంచి ఇప్పటి వరకు 25 రోజుల్లో అదనంగా మరో 25 టీఎంసీల నీటిని ఏపీ నిరాటంకంగా తరలించుకుపోయింది. ఫలితంగా తెలంగాణకు సాగు, తాగునీటి గండం పొంచి ఉన్నది. జలాల వినియోగాన్ని కేఆర్ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) పట్టించుకోకపోవడం, ఇక్కడి కాంగ్రెస్ సర్కారు సైతం నోరుమెదకపోవడంతో ఏపీ ఇష్టారీతిన జలాలను తరలించుకుపోతున్నది. సాగర్ కుడి కాలువ కింద ఏపీకి వాస్తవంగా 132 టీఎంసీల జలాల కేటాయింపు ఉన్నది. కానీ ఇప్పటికే ఎన్నడూ లేని విధంగా 180 టీఎంసీల కృష్ణా జలాలను మళ్లించింది. కోటాకు మించి 52 టీఎంసీలను అధికంగా కొల్లగొట్టింది. కాలువ పూర్తిస్థాయి సామర్థ్యం 9,000 క్యూసెక్కులు, పవర్‌హౌస్ నుంచి అదనంగా 5,000 క్యూసెక్కులు నికరంగా రోజుకు 14,000 క్యూసెక్కుల (ఒక టీఎంసీన్నర) మేరకు జలాలను ఏపీ మళ్లించింది. నవంబర్ నెలాఖరు నుంచే సాగర్ కుడి కాలువ ద్వారా జలాల తరలింపు ప్రక్రియను ఏపీ ముమ్మరం చేసింది. బోర్డు ఫిబ్రవరి 27న నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఈ విషయమై చర్చ కొనసాగింది. ఆ సందర్భంగా కుడికాలువ నుంచి నీటి విడుదలను తగ్గించాలని ఏపీ బోర్డు నామమాత్రంగా సూచించింది. రోజుకు 5,000 క్యూసెక్కులనే డ్రా చేయాలని చెప్పి చేతులు దులుపుకున్నది. కానీ ఏపీ ఇప్పటివరకూ నీటి తరలింపును ఆపడమేలేదు. రోజుకు 8 వేల క్యూసెక్కులను సరఫరా చేసుకుంటున్నది. ఏపీ జలాల తరలింపును అడ్డుకోవాలని తెలంగాణ అధికారులు లేఖలు రాసినా బోర్డు కనీసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

### పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్

తెలంగాణ కాంగ్రెస్ సర్కారు ఎక్కడా నోరు మెదకపోవడం, అడ్డుచెప్పకపోవడంతోనే ఏపీ కోటాకు మించి నిరాటంకంగా ఇప్పటికీ సాగర్ నుంచి కృష్ణా జలాలను తరలించుకుపోతున్నది. ఈ ఏడాది యాసంగి ప్రారంభంలో త్రీమెంబర్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని బోర్డును కనీసం అడగనే లేదు. నవంబర్ నుంచే సాగర్ కుడి కాలువ నుంచి తన వాటాకు మించి ఏపీ నీటిని మళ్లిస్తున్నా తెలంగాణ సర్కారు మాత్రం చోద్యం చూస్తూ వచ్చింది. 15 రోజులకు ఒకసారి సమావేశం కావాలని నిర్ణయించినా, ఇప్పటికీ దాదాపు నెలరోజులవుతున్న మళ్లీ దానిపై నోరెత్తడమే లేదు. తొలుత యాసంగి సీజన్‌కు 116 టీఎంసీలు కావాలని, ఆ తర్వాత 63 టీఎంసీలకు దిగివచ్చి తుదకు 40 టీఎంసీలనే సాధించింది. ఆ జలాలనైనా పూర్తిస్థాయిలో వినియోగించలేదు. ఈ వ్యవధిలోనే ఏపీ 25 రోజుల్లోనే 25 టీఎంసీలు తరలించిండమే కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి దర్పణం పడుతుంది.

### చోద్యంచూస్తున్న కేఆర్ఎంబీ

గత ఫిబ్రవరి 27న నిర్వహించిన అత్యవసర సమావేశంలో నీటివినియోగ వాటాలను కేఆర్ఎంబీ నిర్ణయించలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో కలిపి 60 టీఎంసీలే అందుబాటులో ఉన్నాయని, డిమాండ్ల మేరకు నీళ్లను ఇవ్వలేమని బోర్డు చేతులెత్తేసింది. అందుబాటులో ఉన్న నీటిని ఇరు రాష్ర్టాలే వివాదాలు లేకుండా వినియోగించుకోవాలని బాధ్యత నుంచి తప్పుకొని చేతులు దులుపుకున్నది. మొదట తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉచిత సలహాలు ఇచ్చింది. ఎవరికి ఎంత అవసరం ఉంటుందో ప్రతీ 15 రోజులకు ఒకసారి భేటీ కావాలని, ప్రణాళికతో ముందుకెళ్లాలని ఇరు రాష్ర్టాలకు సూచించి బోర్డు సమావేశాన్ని ముగించింది. కానీ ఆ తర్వాత మళ్లీ ఇప్పటివరకు సమావేశాన్ని నిర్వహించనేలేదు. నీటి విడుదలను పర్యవేక్షించిన దాఖలాలూ లేవు. ఏపీ నీటిని తరలించుకుపోతున్నా బోర్డు మాత్రం చోద్యం చూస్తూ కూర్చున్నది.

## 'మేడిగడ్డ' ఇంజినీర్లపై విచారణ

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బరాజ్ పనులు కొనసాగుతుండగా, పనులు పూర్తైనట్టు సర్టిఫికెట్ జారీచేసిన ఇంజినీర్లను విచారించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. మేడిగడ్డ బరాజ్ నిర్మాణ సమయంలో ఎస్ఈగా రమణారెడ్డి, ఈఈ తిరుపతిరావు కొనసాగారు. పనులు సాగుతుండగానే ముందస్తుగా కంప్లీషన్ సర్టిఫికెట్ జారీ చేశారని అభియోగాలు వచ్చాయి. దీనిపై వివరణ ఇవ్వాలని సదరు ఇంజినీర్లకు జనవరి 3న మెమోలు జారీచేసింది. వారు ఇప్పటికే స్టేట్‌మెంట్లను దాఖలు చేశారు. వారిని విచారించేందుకు సీఈ అంజాద్ హుస్సేన్‌ను ఎంక్వైరీ ఆఫీసర్‌గా, ప్రెజెంటింగ్ ఆఫీసర్‌గా డిప్యూటీ ఈఎన్‌సీ శ్రీనివాస్‌ను నియమిస్తూ గురువారం ఇరిగేషన్‌శాఖ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు నేతృత్వం వహిస్తున్న జస్టిస్ ఘోష్ మరోసారి 22న హైదరాబాద్‌కు రానున్నారు.

## కర్ణాటక రైతుల నీటి చౌర్యం

- ఆర్డీఎస్‌కు దక్కకుండా వచ్చిన నీరు వచ్చినట్టు తోడివేత
- 3.12 టీఎంసీలకు.. 0.700 టీఎంసీలే చేరిక
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో అడుగంటుతున్న నీటినిల్వ

అయిజ, మార్చి 20 : ఆర్డీఎస్ వాటా నీటిని కర్ణాటక రైతులు అక్రమంగా తోడేశారు. ఆర్డీఎస్, కేసీ కెనాల్ ఉమ్మడి నీటి వాటాను కర్ణాటకలోని టీబీ డ్యాం ద్వారా తుంగభద్ర నదిలోకి ఈ నెల 5 నుంచి 13 వరకు 3.12 టీఎంసీలు వదిలారు. నదిలోకి వచ్చిన నీటిని వచ్చినట్టే కర్ణాటకలో ఏర్పాటు చేసిన భారీ లిఫ్టులు, మోటర్లు, తాగునీటి పథకాల ద్వారా మళ్లించుకుపోయారు. ఆర్డీఎస్ ఆయకట్టుకు 0.276, సుంకేసులకు 0.430 టీఎంసీల నీళ్లు మాత్రమే చేరాయి. ఈ ఏడాది ఆర్డీఎస్‌కు 5.896 టీఎంసీలు, కేసీ కెనాల్‌కు 7.746 టీఎంసీలను టీబీ బోర్డు కేటాయింపులు జరిపింది. అలంపూర్ నియోజకవర్గంలో యాసంగిలో సాగు చేసిన 37 వేల ఎకరాల చివరి విడుత తడికి ఆర్డీఎస్ నీటి వాటా 1.173 టీఎంసీలు, కేసీ కెనాల్ నీటి వాటా 1.944 టీఎంసీలు విడుదల చేయాలని తెలంగాణ, ఏపీ తుంగభద్ర బోర్డు కార్యదర్శికి లేఖలు రాశాయి. దీంతో స్పందించిన కర్ణాటక ప్రభుత్వం, అధికారులు టీబీ డ్యాం నుంచి నీటిని విడుదల చేయగానే నదిలో పారుతున్న నీటిని కర్ణాటక రైతులు అక్రమంగా తోడేసుకున్నారు. నేడు ఆర్డీఎస్, సుంకేసుల బరాజ్‌లో నీటి నిల్వలు పెరగలేదు. దీంతో ఆర్డీఎస్, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించేందుకు వీలు లేకుండాపోయింది. ప్రస్తుతం ఆర్డీఎస్‌లో నీటి నిల్వలు తగ్గుతుండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆనకట్టలో నీటి మట్టం 4.5 అడుగులకు చేరగా.. గురువారం డీ-14 వరకు మాత్రమే నీళ్లు చేరాయని ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల చివరి వరకు సాగునీరు అందితే పంటలు చేతికొచ్చే అవకాశం ఉన్నదని, ఆ దిశగా అధికారులు ప్రయత్నాలు చేయాలని కోరుతున్నారు.

## విద్యుత్తు డిమాండ్ ఆల్‌టైం రికార్డ్

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర చరిత్రలో విద్యుత్తు డిమాండ్ పతాకస్థాయికి చేరుకున్నది. గురువారం 4:39 గంటలకు 17,162 మెగావాట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదేరోజు రికార్డు అయిన అత్యధిక డిమాండ్ 13,557 మెగావాట్లు కాగా, 4 వేల మెగావాట్లు అత్యధికంగా నమోదవడం విశేషం. నిరుడు మార్చి 8న అత్యధిక విద్యుత్తు డిమాండ్ 15,623 మెగావాట్లు నమోదవగా, ఫిబ్రవరి 5న విద్యుత్తు సంస్థలు అధిగమించాయి. మార్చి ప్రారంభం నుంచి విద్యుత్తు డిమాండ్ 16 వేల మెగావాట్లకు మించి నమోదవుతున్నది. తాజాగా 17,162 మెగావాట్లుగా నమోదై ఈ నెల 18న నమోదైన గరిష్ఠ డిమాండ్ 16,976 మెగావాట్లను అధిగమించింది. 11, 017 మెగావాట్లుగా నమోదైంది.

## స్పై కెమెరాల విక్రయాలను అడ్డుకోలేం

- హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): స్పై కెమెరాల విక్రయాలపై కేంద్రానికి మార్గదర్శకాలు జారీచేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణకు హైకోర్టు నిరాకరించింది. వాటి విక్రయాలపై కేంద్రానికి ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేమని తేల్చి చెప్పింది. పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ తుది ఉత్తర్వులు జారీచేసింది. స్పై కెమెరాలు దుర్వినియోగమైతే చర్యలు తీసుకునేలా చట్టాలున్నాయని కేంద్రం ప్రతివాదన చేసింది. మొబైల్ కెమెరాలను గుర్తించే అవకాశం ఉందని, స్పై కెమెరాలను రహస్యంగా అమర్చుతున్నారని న్యాయవాది అన్నారు. పిటిషనర్ వాదనను తోసిపుచ్చిన హైకోర్టు, కేంద్రానికి ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది.

## హైడ్రాకు డిప్యూటేషన్‌పై ఇంజినీర్లు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): హైడ్రా విభాగంలో పనిచేసేందుకు ఇరిగేషన్‌శాఖ నుంచి ఇంజినీర్లను డిప్యూటేషన్‌పై నియమించారు. ఈ మేరకు శాఖ సెక్రటరీ రాహుల్‌బొజ్జా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. డీఈఈలు శివకృష్ణ, సూర్య అర్చనను డిప్యూటేషన్‌పై హైడ్రాకు కేటాయించారు. వారు ఏడాది కాలంపాటు హైడ్రాలో పనిచేయనున్నారు.